ముందుకు కదలని మురుగు

- ఆవ రోడ్డులో ప్రయాణిస్తే ముక్కుమూసుకోవాల్సిందే..
- దుర్వాసనతో వాహన చోదకులు, స్థానికులు, వ్యాపారుల ఇక్కట్లు
- హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులో కల్వర్టు వద్ద అధ్వాన పరిస్థితి



హుకుంపేటలో సీసీ కల్వర్టు వద్ద ముందుకు కదలని మురుగునీరు



ఆవ కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

రాజమహేంద్రవరం రూరల్: ఆ రహదారిలో రోజూ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వందలాది మంది ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రహదారిలో సీసీ కల్వర్టు సమీపంలోకి వచ్చేసరికి ముక్కు పగిలిపోతుంది.అక్కడ వస్తున్న దుర్వాసన భరించలేక వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ హుకుంపేట జాతీయరహదారి నుంచి తూర్పురైల్వేస్టేషన్‌కు వెళ్లేరోడ్డులో నూతనంగా నిర్మించిన సీసీ కల్వర్టు వద్ద పరిస్థితి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నూతనంగా సీసీ కల్వర్టు నిర్మాణం

ఇటీవల రూ.1.37 కోట్లతో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు స్థానంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా సీసీ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ కల్వర్టుపై నుంచి నెలరోజులుగా వాహనాలు, ప్రయాణికుల రాకపోకలు సాగుతున్నాయి. కల్వర్టు నిర్మాణ సమయంలో ఆవ కాలువ నీరు వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. దీంతో కొద్దినెలలకే కల్వర్టు నిర్మాణం పూర్తిచేశారు. సీసీ కల్వర్టు సమీపంలో తీసిన సిల్టును అధికారులు బయటకు తరలించకుండా అక్కడే సర్దేశారు.

దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలి

ఆవకాలువలో గుర్రపుడెక్కను సైతం తొలగించకపోవడంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక నిల్వ ఉంటోంది. దీని వలన కల్వర్టు వద్ద విపరీతమైన దుర్వాసన వెలువడుతోంది. ఆ వాసన వలన కడుపులో పేగులు సైతం కదిలిపోతున్నాయని స్థానికులతో పాటు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టుకు సమీపంలో ఉన్న వ్యాపారులు పరిస్థితి వర్ణించలేనిది. ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు కాలువలోని సిల్టు తొలగింపు పనులు చేపట్టినా పూర్తిస్థాయిలో చేయకపోవడంతో దుర్వాసన వెలువడుతోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త కొవ్వూరి ధర్మారెడ్డి కోరారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వేమగిరితోట పాఠశాలలో చిన్నారికి పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

కడియం: లింఫాటిక్ ఫైలేరియాసిస్ నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు విస్తృత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి యం.మణి జ్యోత్స్న తెలిపారు. శుక్రవారం వేమగిరితోట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.డాక్టర్ మణిజ్యోత్స్న మాట్లాడుతూ మండలంలోని వేమగిరి, మాధవరాయుడుపాలెం ప్రాథమిక పాఠశాలలు, కడియంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించి ఫైలేరియా వ్యాధి వ్యాప్తిని పరిశీలిస్తారన్నారు. జిల్లా సహాయ మలేరియా ఆఫీసర్ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సబ్‌యూనియన్ సిబ్బంది పి. శ్రీహరి, జే.జగదీష్, పి. మురళీకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

కడియం ఏవోగా శ్రీనివాస్



కడియం: మండల వ్యవసాయాధికారిగా పీవీ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న కే సూర్యరమేష్ రాజమహేంద్రవరం ఏడీఏ పీఏగా బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీల్లో ఇక్కడికి ఏవోగా వచ్చిన పద్మలత సస్పెండ్ కావడంతో సూర్యరమేష్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు పీవీ శ్రీనివాస్ రావడంతో సూర్యరమేష్ ఆయన పాత స్థానానికి వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాస్, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు.

సేవ్ గర్ల్ చైల్డ్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

ధవళేశ్వరం: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సేవ్ గర్ల్ చైల్డ్‌పై శుక్రవారం ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీ, రక్తహీనత నివారణ, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్ ఇన్‌చార్జ్ సత్యవతి, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్‌ఎన్ రమాదేవి, ఎమ్‌పీహెచ్‌ఎస్ శ్రీనివాస్, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్

సీటీఆర్‌ఐ: దేశానికి రైతులు, సైనికులు ఎంత అవసరమో కార్మికుల అవసరం అంతే ఉంది. కార్మికులకు నేడు సరైన గుర్తింపు లేదని రాజీవ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఆర్‌ఎన్‌టీయూసీ) వ్యవస్థాపక అధ్యక్షుడు కోలా ప్రసాద్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా తురాల శ్రీనివాస్ యాదవ్‌ను నియమించినట్లు ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కోలా ప్రసాద్ వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ రాజమండ్రి నగర అధ్యక్షుడిగా ములపర్తి అశోక్‌కుమార్‌ను నియమిస్తూ ఆయన నియామక పత్రాన్ని అందించారు. రాజీవ్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వలూరి రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల హాజరుశాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల. చిత్రంలో ఎంపీపీ సత్యప్రసాద్

కడియం: కడియం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హాజరయ్యారు. శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించారు. అంగన్‌వాడీల్లో పిల్లల హాజరుశాతం పెరగాలని సిబ్బందిని ఆదేశించారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన వారిని అభినందించారు. ఆర్‌అండ్‌బీ, తాగునీరు, పంచాయతీ రాజ్, విద్యుత్, రెవెన్యూ శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కే. రమేష్, తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

కళా ఉత్సవ్ డ్రాయింగ్ పోటీల్లో వర్షిణి ప్రతిభ



విజేత వర్షిణికి బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రాజు

కంబాలచెరువు: బొమ్మూరు డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న కళాఉత్సవ్ 2025 పోటీల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో స్థానిక వంకాయల వారి వీధిలోని సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వర్షిణి ద్వితీయ బహుమతి సాధించిందని ఆ స్కూలు హెచ్‌ఎమ్ పి.దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌జేడీ.రాజు చేతుల మీదుగా వర్షిణి బహుమతి అందుకున్నారు. ఆ విద్యార్థిని ప్రోత్సాహించిన చిత్రలేఖన ఉపాధ్యాయిని, గైడ్ టీచర్ అనంతలక్ష్మిని పాఠశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

కళలే సమాజానికి ప్రతిబింబాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీటీఆర్‌ఐ: భారతీయ నృత్య సంప్రదాయాల్లో ఉన్న కళారూపాలే సమాజాన్ని ప్రతిబింబిస్తాయని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అభ్యపకుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. శుక్రవారం విజయ శంకర ప్రభుత్వ సంగీత కళాశాలలో కూచిపూడి నాట్య సంహిత పుస్తక పరిచయ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు జ్ఞానబోధ చేస్తూనే మానసిక వికాసానికి మనో ఉల్లాసానికి దోహదపడేదివి నాట్యం, సంగీతం అని వాటిని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన కళాగౌతమి డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ కూచిపూడి నాట్యం మన తెలుగువారి సంప్రదాయ రీతులకు అద్దం పట్టేదిగా ఉంటుందని అన్నారు. పుస్తక సమీక్ష చేసిన డాక్టర్ శ్రీపాద సీతాలక్ష్మి మాట్లాడుతూ పసుమర్తి శ్రీనివాస శర్మ రచించిన 'కూచిపూడి నాట్య సంహిత' ప్రతి ఒక్క నాట్యాచార్యునికి దిక్సూచి లాంటిదని కొనియాడారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ లలిత మాట్లాడుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో నమోదు కోసం భారత్ ఆర్ట్స్ అకాడమీ 7,209 మంది కళాకారులతో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో డిసెంబర్ 27న ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీహెచ్ వి.రమాదేవి, అడ్డాల నాగేశ్వరరావు, సీహెచ్.శ్రావణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళన



ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం సర్కిల్ ఎస్‌ఈ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యధోరణి కారణంగా విద్యుత్ సిబ్బంది సమస్యలు, న్యాయమైన డిమాండ్లు అమలు చేయకపోవడంతో ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉద్యోగులు అన్నారు. శుక్రవారం బొమ్మూరులోని ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం సర్కిల్ ఎస్‌ఈ ఏ.రమేష్‌కు ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు సమస్యలు, డిమాండ్లు, దశల వారీ ఆందోళన విషయంపై వినతిపత్రం అందజేశారు. ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం సర్కిల్ జేఏసీ చైర్మన్ జగతా అచ్యుతరామయ్య, కన్వీనర్ పీవీ రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు న్యాయమైన సమస్యలు, డిమాండ్లు అమలు చేసే వరకు దశలవారీ ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. ఈనెల 15,16వ తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావడం, 17,18 తేదీల్లో అన్ని సర్కిల్ ఆఫీసులు, జనరేటింగ్ స్టేషన్ల ముందు భోజన విరామ సమయంలో ధర్నా, 19,20 తేదీల్లో అన్ని సర్కిల్ ఆఫీసుల, జనరేటింగ్ స్టేషన్ల ముందు రిలే నిరాహార దీక్షలు, 22న అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుత ర్యాలీ ద్వారా కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు కార్యచరణ నిర్ణయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణ అన్యాయం



సేవ్ ఆర్టీసీ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

సీటీఆర్‌ఐ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా ఉన్న 58 ఆర్టీసీలను ప్రైవేటు యాజమాన్యానికి అప్పజెప్పడానికి రంగం సిద్ధం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఏపీఎస్ ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ కేఏస్పీ రావు అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద సేవ్ ఆర్టీసీ పేరుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విద్యుత్ బస్సు స్కీమ్ ద్వారా ఆర్టీసీలో ఉన్న సుమారు లక్ష బస్సులను విద్యుత్ వాహనాలుగా మార్పు చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇవ్వడానికి శరవేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరిస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నగదీకరణ ప్రాజెక్టుకు లోబడి ప్రజల ఆస్తులైన ఆర్టీసీ బస్టాండ్‌లను ప్రైవేట్ సంస్థలకు దారాదత్తం చేయడం సరికాదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి బస్సులు సరిపోవడం లేదని, నూతన బస్సులను వెంటనే కొనుగోలు చేయాలన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 7,200 ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి బీఆర్‌కే కుమారి, పోసుబాబు, నాగమణి, సత్యవతి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ వైద్య కళాశాలల పీపీపీ లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 4న చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో 17 కొత్త వైద్య కళాశాలలలో పదింటిని పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించడం ఆందోళనకరమన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలను 33 సంవత్సరాల లీజుకు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం ద్వారా 1,500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కోటాను 50 శాతం తగ్గించి, 50 శాతం సీట్లను మార్కెట్ రేట్లతో విక్రయించడం వల్ల ఫీజులు అమాంతం పెరుగుతాయన్నారు. జగన్ ప్రభుత్వం నాబార్డ్ నిధులతో రూ.8,500 కోట్లతో 17 కళాశాలల నిర్మాణానికి చొరవ తీసుకుందని, 2023లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 5 కళాశాలలు మాత్రమే ప్రారంభమయ్యాయన్నారు. 80 శాతం నిర్మాణం పూర్తయిన 10 కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లను రద్దు చేయమని ఎన్‌యంసీకి కూటమి ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. ఇది పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం పారదర్శకత లేకుండా, కన్సల్టెన్సీల ద్వారా కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర పన్నుతోందన్నారు. చిత్తూరులో అపోలో సంస్థ ప్రభుత్వ ఆసుపత్రిని వినియోగిస్తూ కొత్త ఆసుపత్రి నిర్మించకపోవడం, ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ఫీజులతో అరకొర వైద్యం అందడం సామాన్యులకు నష్టం కలిగిస్తోందన్నారు. పీపీపీ మోడల్ విస్తరిస్తే అన్ని ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 42 బెంచ్‌లలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, ప్రమాద కేసులు, బ్యాంకు కేసులు, ప్రీ లిటిగేషన్ తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏఎస్ఆర్ జిల్లా రంపచోడవరం డివిజన్‌లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించనున్నట్టు తెలిపారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలి

ధవళేశ్వరం: తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అధికారులకు సూచించారు. శుక్రవారం ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.40 లక్షలతో ఆర్‌ఎస్‌ఎఫ్ ఫిల్టర్ పనులకు అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. ఏపీ పేపర్‌మిల్ సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర శాలీవాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, డీఈ శ్రీనివాస్, ఏఈ సంపత్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, నాయకులు పుక్కళ్ల రాజు, ఆళ్ల ఆనందరావు, వర్రే రాజేష్, అంబటి శ్రీను, బత్తిన ఏడుకొండలు, నీలి కోటేశ్వరరావు, పల్లా రామస్వామి, దొడ్డి బాబ్జీ పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ కళాశాల అభివృద్ధికి కృషి

కంబాలచెరువు: కందుకూరి వీరేశలింగం పంతులు డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలో మేజర్ డ్రెయినేజీపై ఇనుప షట్టర్లు ఏర్పాటు చేసేందుకు రూ.65 లక్షలతో చేపట్టనున్న పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కేవీటీ కళాశాల ఆవరణలో నగరపాలక సంస్థ గతంలో నిర్మించిన మేజర్ డ్రెయినేజీ నుంచి వచ్చే దుర్వాసన కారణంగా స్థానికులు చాలా ఇబ్బందిపడేవారని, ఫిర్యాదులు రావడంతో డ్రెయినేజీపై జీఐ షీట్ ఏర్పాటు చేసేందుకు రూ.65 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఏపీ జెన్‌కోను సందర్శించిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



పరిశ్రమ సందర్శనకు వెళ్తున్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు విజయవాడలోని ఏపీ జెన్‌కో ఇండస్ట్రియల్‌ను సందర్శించారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర శుక్రవారం తెలిపారు. పవర్ ప్లాంట్ ఆర్గనైజేషన్ స్ట్రక్చర్, నిర్వహణ ప్రక్రియ, ఉత్పత్తి ప్రక్రియ, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, మానవ వనరుల నిర్వహణ తదితర అంశాలను విద్యార్థులు పరిశీలించారని తెలిపారు. జెన్‌కో డిప్యూటీ ఇంజినీర్ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ ప్రక్రియ, ట్రాన్స్‌ఫర్మేషన్ వ్యయం తదితర అంశాలను వివరించారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ క్రాంతి, వాణిజ్య విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.షణ్ముఖరావు, డాక్టర్ ఏఏ.అన్నపూర్ణ, డాక్టర్ వీవీవీ.సత్యవతి, ఎస్.దీక్షిత, హెచ్ఎస్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



సైబర్ నేరాలపై మాట్లాడుతున్న అయ్యప్పరెడ్డి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఇటీవల ఆన్‌లైన్ మోసాలు విస్తృతంగా జరుగుతున్నాయని, ముఖ్యంగా యువతను, రిటైర్డ్ ఉద్యోగులను, ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని మోసగాళ్లు వివిధ రకాలుగా మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.అయ్యప్పరెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీస్ నెట్వర్క్ సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు సైబర్ నేరాలపై శుక్రవారం స్థానిక ఇన్నీసుపేట రజక కల్యాణ మండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా యూపీఐ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ కస్టమర్ కాల్స్, ఓటీపీ షేరింగ్ మోసాలు వంటి అంశాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేక్ జాబ్ ఆఫర్లు, లోన్ యాప్‌లు, డిస్కౌంట్ స్కామ్‌లు, ఏటీఎం కార్డ్ క్లోనింగ్ వంటివాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దని, ఇంటర్నెట్‌ను సమాచార సాధనంగా మాత్రమే వాడాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ బ్యాంక్ వివరాలు, ఓటీపీ పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైం.గవ్.ఇన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్ సిబ్బంది వైవీ సురేష్, అబ్దుల్ షౌకత్, సుమారు 200 మంది మైక్రో ఫైనాన్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి డ్రోన్ కెమెరాలతో నిఘా




నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల నిఘా చిత్రం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఎస్పీ డి.నరసింహాకిశోర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాలు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, పాడుపడిపోయిన ఇల్లు, తోటలపై డ్రోన్ కెమెరాలు సంచరిస్తాయన్నారు. బహిరంగ మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు.

నిధుల దుర్వినియోగంపై పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-4)గా విధులు నిర్వహిస్తున్న సమయంలో నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై ప్రస్తుతం రాజానగరం మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సీహెచ్ రాణిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పంచాయతీ కార్యదర్శి సీహెచ్ శాంతామణి ఈ విషయాన్ని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి రాణి వెంకటనగరం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించిన సమయంలో పంచాయతీ నిధుల్లో రూ.34,56,091 దుర్వినియోగం అయినట్టు లభించిన ఆధారాలు, సంబంధిత అధికారుల విచారణ ద్వారా తేలిందన్నారు. నిధుల దుర్వినియోగం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991లోని రూల్ 8 (1) ప్రకారం సీహెచ్ రాణిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్ శాంతామణి తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సీహెచ్ రాణి ప్రధాన కార్యాలయం సీతారాంపురం గ్రామ పంచాయతీగానే నిర్ణయించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయం వదిలి వెళ్లరాదని ఆదేశాలు జారీ చేశామన్నారు. రాజానగరం ఎంపీడీవోకు సీహెచ్ రాణి సస్పెన్షన్ ఆర్డర్ అందజేయడం, ప్రత్యామ్నాయ ఇన్‌చార్జి నియామకం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవోగా ఆర్మ్‌స్ట్రాంగ్



రాజమహేంద్రవరం రూరల్: మండలాభివృద్ధితోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆర్మ్‌స్ట్రాంగ్ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయనను రూరల్ ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుంచి ఆయన రెగ్యులర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

సారా కేసులో ముద్దాయికి రిమాండ్

రంగంపేట: సారా కేసులో ముద్దాయికి రిమాండ్ విధించినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సుధ తెలిపారు. శుక్రవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం సారా కేసులో నిందితుడైన వడిశలేరుకు చెందిన కురుకూరి వెంకటేష్ కొంతకాలంగా పరారీలో ఉన్నాడని అతడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు. మర్రిపూడికి చెందిన నెల్లి కృష్ణ బైండోవర్ ఉల్లంగించి సారా విక్రయం కొనసాగించడంతో స్థానిక తహసీల్దార్ కోసు అనసూయ నిందితుడికి రూ.40 వేలు జరిమానా విధించినట్టు ఎక్సైజ్ శాఖ సీఐ తెలిపారు.

సినిమాలు



శ్యామల : కిష్కింధపురి
సూర్యమినీ : ది కంజూరింగ్ , ఘాటీ
సూర్యప్యాలెస్ : డీమోన్ స్లేయర్
స్వామి : మిరాయ్
అనుశ్రీ : మిరాయ్
శివజ్యోతి : కిష్కింధపురి
రాజా : మిరాయ్
ఊర్వశి : లిటిల్‌హార్ట్స్, మహావతార్ నరసింహ
మేనక : కిష్కింధపురి
రంభ : మిరాయ్
అప్సర : కొత్తలోక
అశోక : మదరాసి, డీమోన్ స్లేయర్

నామవరం

వీఎస్ మహల్ : మిరాయ్

ధవళేశ్వరం

మురళీకృష్ణ : మిరాయ్

కడియం

వెంకటసూర్య : మిరాయ్